విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి ఉత్తమ్‌కు వినతి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కోదాడ టౌన్, జూన్ 10 : విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం కోదాడలో భారీ నీటిపారుదల, సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య మాట్లాడుతూ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు ఉచిత ఆరోగ్య పథకం అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, నూతన పీఆర్సీ అమలు చేయాలని అన్నారు. విశ్రాంతి ఉద్యోగుల సంఘానికి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, నాయకులు వేనేపల్లి శ్రీనివాసరావు, వై.నరసయ్య, ఖలీల్, అహ్మద్, అప్పారావు, గడ్డం నరసయ్య పాల్గొన్నారు.

సినీ రంగంలో కోదాడ వాసుల రాణింపు అభినందనీయం

- ఎమ్మెల్యే పద్మావతి

సర్కార్ శివ లఘుచిత్రం షూటింగ్‌ను క్లాప్ కొట్టి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ టౌన్, జూన్ 10 : సందేశాత్మక చిత్రాలతో కోదాడ వాసులు సినీ రంగంలో రాణించడం అభినందనీయమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. శ్రీరాఘవేంద్ర స్వామి ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాతలు బుడిగం నరేశ్, రుద్దనేని శ్రీనివాస్ నిర్మిస్తున్న సర్కార్ శివ లఘు చిత్రం షూటింగ్‌ను కోదాడ పట్టణంలో సోమవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాతగా, నటుడిగా బుడిగం నరేశ్ మంచి చిత్రాలతో సినీ రంగంలో పేరు తెచ్చుకోవాలన్నారు. కోదాడ నుంచి సినీ రంగంలో రాణించడానికి కృషి చేస్తున్న నిర్మాతలు, దర్శకులు, నటులు, ఇతర కళాకారులకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. సర్కార్ శివ చిత్రం విశేష ప్రేక్షక ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దర్శకుడు కాసాని శివ, నటీ నటులు బుడిగం నరేశ్, ప్రభాకర్‌రావు, ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, శృతి, సైదులు, వెంకటయ్య, చిత్రం యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సామేల్‌పై ముఖ్యమంత్రికి ఫిర్యాదు

- దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడంటూ సొంత పార్టీ నాయకుల ఆరోపణలు
- సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న కాంగ్రెస్ నాయకుల పోస్టు

సూర్యాపేట, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అవినీతి, దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని సొంత పార్టీకి చెందిన కొంత మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గం పరిధిలో దోసెడు ఇసుకను కూడా తీయనీయనని హామీ ఇచ్చారని, నేడు లారీల కొద్దీ ఇసుక అక్రమ రవాణా అవుతుండడంపై ఇటీవల వీడియో విడుదల చేశారు. ఎమ్మెల్యే అక్రమాలు చేస్తున్నాడంటూ తాజాగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే సామేల్‌పై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తున్నట్లు పలువురు నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కమీషన్ తీసుకోవడంతో నాణ్యత లేని సిమెంట్, క్వాలిటీ లేని మెటీరియల్ వాడడంతో మూడు నెలలు కాకముందే సిమెంట్ రోడ్లు కంకర తేలాయని తెలిపారు. అడ్డగూడూరు మండలం కాంచనపల్లి కస్తూర్బా పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి కోటి రూపాయల కాంట్రాక్టు ఎమ్మెల్యే కుమారుడే చేస్తున్నాడని ఆరోపించారు. జిల్లా మంత్రి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిసేవారు తన వద్దకు రావద్దని బహిరంగంగా చెబుతున్నాడన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ కాంట్రాక్టు ఒకరిద్దరికే ఇచ్చి, కమీషన్ తీసుకున్నట్లు సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలు వస్తే సామేల్ డిపాజిట్ కోల్పోతాడన్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీగా గెలవడం ఎమ్మెల్యే సామేల్‌కు ఇష్టం లేదని తెలిపారు. ఫ్లెక్సీల్లో మంత్రి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి ఫొటోలు పెట్టవద్దని ఎమ్మెల్యే, ఆయన కుమారుడు ఆదేశిస్తున్నారని చెప్పారు. పార్టీకి ఫిర్యాదు చేసిన వారిలో అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాలువ మాజీ సర్పంచ్ నారగోని అంజయ్యగౌడ్, గూడెపు పాండు మాదిగ, నాగరాజు మాదిగ ఉన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలి

- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి శివకుమార్

ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ నాయకులు

బొడ్రాయిబజార్, జూన్ 10 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అనేక సమస్యలు నెలకొన్నాయని, సరైన మందులు లేక అపరిశుభ్రంగా ఉండడంతో పాటు డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. డాక్టర్ల నిర్లక్ష్యంతో మూడు నెలల్లో నలుగురు చనిపోయారని ఆరోపించారు. ఆసుపత్రి డాక్టర్లు రోగులను మెడిసిన్ కోసం ప్రైవేట్ మందుల దుకాణాలకు పంపిస్తున్నారని, అంబులెన్స్‌కు పది నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. ఆసుపత్రిలో వైద్యులతోపాటు అన్ని రకాల మందులు, అంబులెన్స్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచాలని కోరారు. ఇకనైనా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కారింగుల వెంకన్న, పేర్ల నాగన్న, సయ్యద్, పిడమర్తి లింగన్న, గోగుల వీరబాబు, నవీన్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

విద్యా సామాగ్రిని అందుకున్న పిల్లలతో దాత

గరిడేపల్లి, జూన్ 10 : మండలంలోని పరెడ్డిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కందుల రామ్‌కిశోర్ రెడ్డి, పూర్ణిమారెడ్డి దంపతుల కుమార్తె పూర్వికారామ్ అన్నప్రాసన సందర్భంగా సోమవారం రూ.8వేల విలువ చేసే బ్యాగులు, టిఫిన్ బాక్కులు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఐదేండ్లుగా ఆశ్రీ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు చేయూతనందిస్తున్నామన్నారు. అవసరమైన బ్యాగులు, కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గుగులోతు సైదానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

మోతె, జూన్ 10 : మండలంలోని సిరికొండ గ్రామంలో సోమవారం ఓ గొర్రెల కాపరి బావిలో పడి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కట్టెబోయిన లింగయ్య (32) గొర్రెలు మేపుకొంటూ మంచినీళ్ల కోసం వ్యవసాయ బావిలోకి దిగగా.. కాలుజారి అందులో పడిపోయాడు. ఈత రాక మృతిచెందగా.. తోటి కాపరులు చూసి గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి : కలెక్టర్ వెంకట్రావ్

ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, జూన్ 10 : ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును పరిష్కరించి బాధితులకు అండగా నిలువాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనలకు లోబడి పరిష్కరించాలన్నారు. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ మూడో విడుత కాలనీలో, కేసారంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఇండ్లు అప్పగించాలని ఆర్డీఓ వేణుమాధవ్‌ను ఆదేశించారు. ఇందుకు పది బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే అక్కడ ఉన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా పనులు పూర్తయిన అమ్మ ఆదర్శ పాఠశాలలను స్థానిక ఎమ్మెల్యేలతో ప్రారంభించాలన్నారు. విద్యార్థులకు యునిఫాం, పాఠ్యపుస్తకాలు వారితో ఇప్పించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని ఆదేశించారు. ప్రజావాణిలో 68 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో భూ సమస్యల పరిష్కారం కోసం 36, ఇతర సమస్యలవి 32 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, ఆర్డీఓ వేణుమాధవ్, డీఈఓ అశోక్, డీపీఓ సురేశ్, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం, డీటీడీఓ శంకర్, డీడబ్ల్యూఓ వెంకటరమణ, ఏఓ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

'బీసీలపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి'

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడు సందీప్‌యాదవ్

బొడ్రాయిబజార్, జూన్ 10 : బీసీలపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు గుండాల సందీప్‌యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ ఒత్తిళ్లతో డాక్టర్ రామ్మూర్తి యాదవ్‌కు చెందిన ఆసుపత్రి భవన ర్యాంపును తొలగించడాన్ని ఖండించారు. ఎన్నో సంవత్సరాలుగా అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రామ్మూర్తియాదవ్, గాయత్రి దంపతులు రాజకీయంగా ఎదుగుతున్నారని ఓర్వలేక కొందరు నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో అనుమతులు లేని భవనాలు, రోడ్లపైకి వచ్చిన ర్యాంపులన్నింటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులపై ఇలాంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘాల నాయకులు ఇరుగు మధు, కటకం రమేశ్, లింగరాజు, సందీప్, అఖిల్, తరుణ్, పవన్ పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీను

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరత్ సుబోధ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

నేరేడుచర్ల, జూన్ 10 : వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్‌లో అవకతవకలను నిరసిస్తూ పట్టణంలోని చౌరస్తా వద్ద నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరత్ సుబోధ్‌కుమార్ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు పొందారని, ఇంత పెద్ద సంఖ్యలో మార్కులు రావడంపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. హర్యానాలో ఒకే గదిలో పరీక్ష రాసిన 8 మందికి 720 మార్కులు రావడం ఏంటని, ప్రశ్నాపత్రం లీకైందా.. మాస్ కాపీయింగ్ జరిగిందా? అని ప్రశ్నించారు. ఎన్నో అనుమానాలు ఉన్న నీట్ ఫలితాలపై త్వరగా సమగ్ర విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు బెల్లంకొండ గోవిందు, నాయకులు కొమ్రరాజు వెంకట్, చొల్లేటి శివ, పండు, జయంతి, యశ్వంత్, రాహుల్, నరసింహ, వినయ్ పాల్గొన్నారు.

చౌటపల్లిలో ఆలయ భూముల కౌలుకు వేలం

- మొత్తం రూ.2,71,800 ఆదాయం


వేలంపాట నిర్వహిస్తున్న దేవాలయ అధికారులు

మఠంపల్లి, జూన్ 10 : మండలంలోని చౌటపల్లి వేణుగోపాలస్వామి దేవస్థాన భూములను రైతులకు కౌలు ఇచ్చేందుకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. సర్వే నెంబర్ 593లోని రెండెకరాలను ఐతగాని పిచ్చయ్య రూ.38,200కు దక్కించుకున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ టి.వెంకటచలపతి తెలిపారు. అదే సర్వే నెంబర్‌లోని ఎకరం భూమిని కారింగుల పిచ్చయ్య రూ.24,500కు, 594లోని 5.20 ఎకరాలను ఐతగాని పిచ్చయ్య రూ.1,13,300కు, 593లోని 10గుంటలను ఐతగాని వీరయ్య రూ.5800కు, 726 సర్వే నెంబర్‌లోని 7ఎకరాలను కొండ నాగేశ్వర్‌రావు రూ.90వేలకు వేలం పాడినట్లు చెప్పారు. కౌలు కాల పరిమితి ఒక సంవత్సరం ఉంటుందని, వేలం ద్వారా మొత్తం రూ.2,71,800 ఆదాయం వచ్చిందని తెలిపారు. వేలంలో పరిశీలకులు సీహెచ్ వెంకటనారాయణ, సింగారపు సైదులు, మద్ది హుస్సేన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లచ్చిరెడ్డి, నర్సయ్య, కోటయ్య, ఆలయ అర్చకులు, సిబ్బంది జి.గోవిందరెడ్డి, వై.కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు సంక్షేమ పథకాలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పశ్య పద్మ

కోదాడ టౌన్, జూన్ 10 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు రైతు భరోసా, పంటలకు బోనస్, పంట బీమా పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం వెంటనే విధి విధానాలు రూపొందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. పట్టణ పరిధిలోని తమ్మరలో సోమవారం ఏర్పాటు చేసిన కౌలు రైతుల అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి, కౌలు రైతులను గుర్తించి 2011 చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, కౌన్సిలర్లు సామినేని నరేశ్, బత్తినేని హనుమంతరావు, కనగాల రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు ప్రసాద్, రామయ్య, ప్రసాద్, శేషగిరి, పూర్ణ, హరికృష్ణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మిర్యాల దేవాలయ భూముల వేలం రద్దు

నూతనకల్, జూన్ 10 : మండలంలోని మిర్యాల గ్రామంలో గల సీతారామచంద్రస్వామి దేవాలయ భూముల కౌలు వేలం పాటను రద్దు చేసినట్లు ఈఓ కుశలయ్య తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న నిర్వహించిన వేలం పాటలో రూ.17.40 లక్షలకు కౌలు పాడిన అదే గ్రామానికి చెందిన కొంపెల్లి రాజు.. నియమ నిబంధనలు పాటించనందున రద్దు చేసినట్లు తెలిపారు. తిరిగి ఈ నెల 12న కౌలు వేలం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో దేవాలయ కమిటీ చైర్మన్ రామచంద్రయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేత్రదానంపై అపోహలు వీడాలి

- స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

కోదాడ టౌన్, జూన్ 10 : నేత్రదానం వల్ల మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని కోదాడ స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని జేవీఎస్ వీధికి చెందిన బొడ్ల సత్యనారాయణ సోమవారం అనారోగ్యంతో మృతిచెందగా.. విషయం తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు నేత్రాలను దానం చేయాలని ఆయన కుటుంబ సభ్యులను కోరారు. వారి అంగీకారంతో ఖమ్మం నేత్ర నిధికి సమాచారం అందించి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 55 మందికి నేత్రాలను దానం చేసి కంటి చూపు తెప్పించామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ యాద సుధాకర్, కుటుంబ సభ్యులు బొబ్బిలి రాజ, మదన్, నాగేశ్వర్‌రావు, ఖమ్మం నేత్ర నిధి నిపుణులు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

పాలకవీడు, జూన్ 10 : జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ బి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోలకు రూ.1,116 రూపాయలు అవుతుందని పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో వచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

బీసీ హాస్టళ్ల మరమ్మతులకు నిధులు ఇవ్వాలి

మేళ్లచెర్వు, జూన్ 10 : రాష్ట్ర వ్యాప్తంగా బీసీ హాస్టళ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూళిపాల ధనుంజయనాయుడు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. భావిభారత పౌరులు చదువుకునే హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు లేక దయనీయంగా మారాయని పేర్కొన్నారు. వాటి మరమ్మతుల కోసం వెంటనే రూ.20 కోట్లు విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు.

బాలికపై లైంగికదాడి కేసులో వ్యక్తికి 25 ఏండ్ల జైలు శిక్ష

సూర్యాపేట లీగల్, జూన్ 10 : సూర్యాపేట పట్టణంలోని అన్నాదురై నగర్‌కు చెందిన ఓ వ్యక్తిపై నేర నిరూపణ కావడంతో న్యాయస్థానం జైలుశిక్షతోపాటు జరిమానా విధించింది. వివరాలిలా ఉన్నాయి.. 2023 ఫిబ్రవరి 25న రాత్రి 9గంటలకు నిందితుడు ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి తల్లి సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ నాగభూషణం నిందితుడిపై కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. అనంతరం సాక్షులను విచారించిన చిన్న పిల్లలపై అత్యాచార నిరోధక చట్టం కోర్టు న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ నిందితుడిని దోషిగా నిర్ధారించి శుక్రవారం తీర్పు వెలువరించారు. ముద్దాయికి 25 ఏండ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు.

కౌసల్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

కౌసల్యకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి

సూర్యాపేట రూరల్, జూన్ 10 : బీఆర్‌ఎస్ నాయకుడు, టేకుమట్ల మాజీ సర్పంచ్ ఉప్పు శ్రీనివాస్ మాతృమూర్తి కౌసల్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మండలంలోని టేకుమట్ల గ్రామంలో సోమవారం జరిగిన కౌసల్య దశదిన కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వీడిన ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య మిస్టరీ

- వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను వేధించిన భార్య
- భరించలేక ఉరి వేసుకొని భర్త ఆత్మహత్య
- భార్య, ఆమె ప్రియుడు, అత్త, బావమరిది అరెస్ట్

హుజూర్‌నగర్‌లో నిందితులను చూపుతున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, జూన్ 10 : పట్టణంలో సంచలనం రేపిన ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య మిస్టరీని పోలీసులు చేధించారు. సీఐ చరమందరాజు, ఎస్‌ఐ ముత్తయ్యతో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. హుజూర్‌నగర్ పట్టణం పద్మశాలి బజార్‌కు చెందిన చిట్టిప్రోలు రంజిత్‌కుమార్ 14 సంవత్సరాల క్రితం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన స్వప్నను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు. కాగా, గత సంవత్సరం నుంచి స్వప్న సీతారాంనగర్ కాలనీలో రేషన్ షాపు నడిపిస్తుండగా.. రంజిత్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. అయితే.. ఆరు నెలల క్రితం రంజిత్‌కుమార్ కులస్తుడైన మిట్టకోలు దుర్గాప్రసాద్‌కు స్వప్నతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త అక్రమ సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలో రంజిత్‌కు తెలియకుండా స్వప్నను తిరుపతికి తీసుకెళ్లడంతో రంజిత్ పలుమార్లు దుర్గాప్రసాద్‌ను హెచ్చరించాడు. వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో కుటుంబంలో తరుచూ గొడవలు జరుగుతుండేవి. దాంతో రంజిత్ అత్త రాచకొండ నాగమణి, బావమరిది చంద్రశేఖర్, స్వప్న ప్రియుడు దుర్గాప్రసాద్ కలిసి రంజిత్‌ను పలుమార్లు కొట్టారు. దీంతో మనస్తాపానికి గురైన రంజిత్ నెల రోజుల క్రితం తన చావుకు భార్య స్వప్న, ఆమె ప్రియుడు దుర్గాప్రసాద్, ఆమె తల్లి నాగమణి, సోదరుడు చందు కారణమని సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఆ వీడియో చూసిన వారు మళ్లీ రంజిత్‌పై దాడి చేసి ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టారు. నెల రోజుల నుంచి మఠంపల్లిలోని తన బావ ఖుర్షిద్ వద్ద రెస్టారెంట్‌లో రంజిత్ పని చేసుకుంటూ ఉన్నాడు. ఈ నెల 7న తన కుమార్తెలను చూడడానికి సీతారాంనగర్‌లోని ఇంటికి వచ్చిన రంజిత్ భార్యతో గొడవ పడగా.. అదే రోజు ఆమె పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. 8వ తేదీన రంజిత్ ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందిన విషయాన్ని స్థానికులు అతని కుటుంబ సభ్యులకు చెప్పారు. భార్య స్వప్న, ఆమె ప్రియుడు దుర్గాప్రసాద్, అత్త నాగమణి, బావమరిది చందు వేధింపుల కారణంగా మృతి చెందినట్లు రంజిత్ తరపు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దాంతో సోమవారం నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

పాలకవీడు, జూన్ 10 : మండలంలోని రావిపహాడ్‌లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సైదులు మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లతో కలిసి గ్రామంలో సర్వే నిర్వహించామన్నారు. మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందుతుందా.. పథకం అమలులో లోటుపాట్లను పరిశీలించి మండల ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నేరేడుచర్లలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ బాలూనాయక్ అన్నారు. జాజిరెడ్డిగూడెంలో సోమవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన గుణాత్మక విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నూతనకల్ : మండలంలోని పెదనెమిల గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'బడికి పంపడం మీ వంతు.. చదువు చెప్పడం మా వంతు' అంటూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కల్లూరు పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎల్.శ్రీనివాసరావు, నేరేడుచర్ల జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు కోరారు. సోమవారం బడిబాట కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సర్కారు ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటనర్సయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, నరసింహారావు, స్రవంతి, రవికుమార్, కృష్ణ, ప్రసాద్, శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. మండల కేంద్రంలో కేజీబీవీ ఉపాధ్యాయులు సోమవారం ర్యాలీ నిర్వహించి, ఇంటింటికీ ప్రచారం చేపట్టి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లలను చేర్పించే విధంగా అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారి ఒగ్గు విజయకుమారి, ఉపాధ్యాయులు విజయకుమారి, సల్మా ఫర్జానా, గంగ, రేణుక, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండలంలోని తొండ గ్రామం ఎస్సీ కాలనీలో ఉపాధ్యాయులు సోమవారం బడిబాట ర్యాలీ నిర్వహించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఇంటింటి ప్రచారం చేపట్టి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : తెలంగాణ పౌర స్పందన వేదిక అధ్వర్యంలో కోదాడ పట్టణ బాలుర ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంగ మాట్లాడుతూ సర్కారు బడుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు ఆర్.ధనమూర్తి, వి.వెంకటరమణ, జి.వెంకట్‌రెడ్డి, ఎం.రంగారెడ్డి, జి.వెంకటేశ్వర్లు, జానీమియా, స్వామి, శేఖర్, హమీద్ పాల్గొన్నారు.

నాగారం : మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, మౌలిక వసతుల గురించి వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.